సాక్షి మంచిర్యాల

గురువారం । 8 । ఫిబ్రవరి । 2024



నాగోబా స్మరణలో 'మెస్రం'

నాగోబా స్మరణలో మర్రిచెట్టు వద్ద బసచేసిన మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ నెల 9న నాగోబా మహాపూజకు అవసరమయ్యే గంగాజలంతో బస చేశారు. - 8లో▸



ట్రిపుల్‌ఐటీ గాడిన పడేనా..?

బాసర ట్రిపుల్‌ఐటీలో సమస్యలపై ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తున్నారు. ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ వసతిగృహాలు పరిశీలించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0 /22.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉత్తరం దిశగా గాలులు వీస్తాయి. చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సమన్వయంతో పని చేయాలి



నెన్నెల: వివరాలు తెలుసుకుంటున్న రాహుల్

నెన్నెల/భీమిని: గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు సమన్వయంతో పని చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. బుధవారం ఆయన నెన్నెల మండలం నందులపల్లి, కన్నెపల్లి మండలం రెబ్బెన గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులను పరిశీలించారు. రాబోయే వేసవిలో తాగునీటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలని నందులపల్లి కార్యదర్శి పద్మనాభంను ఆదేశించారు. రెబ్బెన గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. నెన్నెల మండల ప్రత్యేక అధికారి సిడాం దత్తు, పంచాయతీ ప్రత్యేక అధికారి ఇమ్రాన్‌ఖాన్, ఏపీఓ నరేష్, కన్నెపల్లి ఎంపీడీఓ రాధాకిషన్, ఆర్‌ఐ కిషన్‌రావు, పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యక్రమాలపై అవగాహన

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి గ్రామ పంచాయతీలో బుధవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలపై జెడ్పీ సీఈఓ కాకిరాల నరేందర్ అవగాహన కల్పించారు. వేమనపల్లిలో ఎంపీపీ కోలి స్వర్ణలత, ఎంపీడీఓ లక్ష్మయ్య, అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు పారిశుధ్య అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రయోగ పరీక్షలు



పరిశీలిస్తున్న డీఐఈవో శైలజ

మంచిర్యాలఅర్బన్: ఇంటర్ ప్రయోగ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 698 మంది విద్యార్థులకు గాను 641 మంది హాజరుకాగా 57 మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ విద్యార్థులు 362 మందికి గాను 338 మంది హాజరు కాగా 24 మంది హాజరు కాలేదు. వొకేషనల్ విద్యార్థులు 336 మందికి గాను 303 మంది హాజరు కాగా 33 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 469 మందికి గాను 444 మంది హాజరుకాగా 25 మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ విద్యార్థులు 220 మందికి గాను 209 మంది హాజరు కాగా 11 మంది హాజరు కాలేదు. వొకేషనల్ విద్యార్థులు 249 మందికి గాను 235 మంది హాజరు కాగా 14 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని శ్రీహర్ష కళాశాల పరీక్షా కేంద్రాన్ని డీఐఈవో శైలజ పరిశీలించారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు చేయూత



వినికిడి పరికరాలు అందజేస్తున్న డీఈవో

మంచిర్యాలఅర్బన్: ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికల అభివృద్ధి, ఆరోగ్యం బాగు కోసం స్వచ్ఛంద సంస్థలు ముందుకువచ్చి చేయూతనందించాలని జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య అన్నారు. బుధవారం జిల్లా సైన్స్ కేంద్రంలో వుయ్ హియర్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ గుజరాత్ సంస్థ, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో జిల్లాలో వినికిడి లోపం కలిగిన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి పరికరాలు అందజేశారు. 43 మంది బాలబాలికలను పరీక్షించి 33 మంది వినికిడి పరికరాలకు అర్హులని గుర్తించారు. జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి చౌదరి, సెక్టోరల్ అధికారి సత్యనారాయణ మూర్తి, డీఎస్‌వో మధుబాబు, సంస్థ ప్రతినిధులు సాహిల్ కులదీప్, రోహన్, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

ఆబ్కారీలో మామూళ్ల కిక్కు!

- రెండేళ్లకోసారి రెన్యూవల్స్ పేరుతో వసూళ్లు
- గతంలో కంటే ఈసారి రేటు పెంచిన వైనం
- ప్రతీ వైన్స్ నుంచి ముట్టజెప్పాల్సిన పరిస్థితి
- కింది నుంచి పై దాకా అంతా తెలిసే తతంగం



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మద్యం ధరలు, లైసెన్స్ ఫీజులు పెరిగినట్లుగానే ఆబ్కారీ శాఖకు వైన్స్, బార్ యజమానుల నుంచి అక్రమంగా వసూలు చేసే మామూళ్లు సైతం పెరిగాయి. దీంతో ఆ శాఖకు కిక్కు మామూలుగా ఉండడం లేదు. గతంలో ఇచ్చే మొత్తం కంటే ఈసారి కాస్త ధర పెంచి వసూలు చేస్తున్నట్లు లైసెన్స్‌దారులే చర్చించుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ రెండేళ్లకోసారి మద్యం దుకాణాలకు టెండర్లు పిలిచి లక్కీడ్రాలో దుకాణాలు కేటాయిస్తోంది. ఈసారి అసెంబ్లీ ఎన్నికల కారణంగా లైసెన్స్ గడువుకు ముందే 2023–25 కాలానికి గత ఆగస్టులో దరఖాస్తులు స్వీకరించారు. లక్కీ డ్రా తీసి యజమానులను ఎంపిక చేశారు. చాలాచోట్ల పాత వ్యాపారులే గ్రూపులుగా టెండర్లు వేసి దక్కించుకోగా.. కొన్ని చోట్ల కొత్తవారికి సైతం లక్కీ లాటరీలో దుకాణాలు దక్కాయి. డిసెంబర్ ఒకటి నుంచి మద్యం దుకాణాలు ప్రారంభమయ్యాయి. దుకాణం పరిధిలో జనాభాను బట్టి ఫీజు చెల్లించాలి. ఐదు వేల జనాభా పైన ఉంటే రూ.50లక్షలు, 20లక్షల జనాభా ఉంటే గరిష్టంగా రూ.1.10కోట్లు లైసెన్స్ ఫీజులు సర్కారుకు చెల్లించాలి. జిల్లాలో ఐదు లక్షల జనాభా పరిధిలోనే అన్ని దుకాణాలు ఉండడంతో రూ.50లక్షల నుంచి రూ.65లక్షలలోపే ఫీజులు ఉన్నాయి. ఈ ఫీజు ఆరు వాయిదాల్లో చెల్లించాలి. ఎక్సైజ్ పన్నులు, బ్యాంకు గ్యారంటీలు, స్టాక్ కొనుగోలు అదనం. మద్యం అమ్మినందుకు సాధారణ మద్యంపై 27శాతం, మధ్యస్త బ్రాండ్లపై 20శాతం, ఫారెన్‌లిక్కర్, బీర్‌పై 20శాతం అమ్మకందారుకు రిటైల్ మార్జిన్ ఉంటుంది. ఇవన్నీ నిబంధనల మేరకు చెల్లించినా అధికారుల జేబుల్లోకి మళ్లీ ప్రత్యేకంగా లైసెన్స్‌దారులు ఇవ్వాల్సి వస్తుందనే ఆరోపణలున్నాయి. మద్యం దందాలో చాలా లొసుగులు ఉండడంతో మామూళ్ల పుచ్చుకోవడం అధికారికంగానే వ్యవస్థీకృతంగా మారిపోయింది.

రెండేళ్లకు రెన్యూవల్స్ పేరుతో..

రెండేళ్ల కాలానికి మద్యం విక్రయాలు చేసేందుకు దుకాణాలు దక్కించుకున్న లైసెన్స్‌దారులు ఆబ్కారీ శాఖకు 'రెన్యూవల్స్' పేరుతో పెద్ద మొత్తంలో డబ్బు ముట్టజెప్తున్నారు. గతంలో ఒక్కో దుకాణానికి రూ.50వేల వరకు ఉండగా, ప్రస్తుతం కనీసం లక్ష నుంచి రూ.1.30లక్షల వరకు వసూలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని వైన్ షాపులకు రూ.1.50లక్షల వరకు అనధికారికంగా వసూళ్ల చేసినట్లు సమాచారం. మంచిర్యాల, లక్సెట్టిపేట, చెన్నూరు, బెల్లంపల్లి సర్కిళ్ల పరిధిలో పట్టణ పరిధిలోని వాటికి రూ.1.40లక్షలు రేట్లు ఫిక్స్ చేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ఇక జిల్లా కేంద్రం సర్కిల్ పరిధిలో నెలకు రూ.12.5వేలు వసూలు చేస్తుండగా, పట్టణాలు కాకుండా మండల కేంద్రాల్లో రూ.6నుంచి రూ.8వేల వరకు తీసుకున్నట్లు సమాచారం. ఇవి కాకుండా కొన్ని పోలీసు, ట్రాఫిక్ పరిధిలో అధికారులకు మూడు నెలలకోసారి వసూళ్లు జరుగుతున్నాయి. ఇక బార్లకు సైతం రూ.10వేల చొప్పున ఇవ్వాల్సి ఉండగా, బార్లు చాలావరకు అంతంత మాత్రమే నడస్తున్నాయి. దీంతో వారిపై ఎక్కువగా ఒత్తిడి తేవడం లేదు. హాజీపూర్ మండలం వేంపల్లి మద్యం డిపో నుంచి వైన్స్ షాపులకు మద్యం స్టాక్ లిఫ్ట్ చేయాల్సిందంటే, బండికి కొంత అక్కడి సిబ్బందికి ముట్టజెప్తేనే బండి కదలుతోందనే ఆరోపణలు ఉన్నాయి. మామూళ్ల వ్యవహారం కిందిస్థాయి నుంచి జిల్లా ఉన్నతాధికారుల వరకు అంతా తెలిసే జరుగుతోంది. ఏళ్లుగా మద్యం వ్యాపారంలో ఉన్న వారందరికీ ఇవన్నీ సర్వసాధారణంగా మారింది. దీనిపై ఎవరు ఫిర్యాదులు చేయకపోవడంతో వెలుగులోకి రాక విచారణలు జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి.

కోడ్ తర్వాత యథావిధిగా..

జిల్లాలో మొత్తం 73మద్యం దుకాణాలు, 16బార్లు ఉన్నాయి. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కోడ్ కారణంగా వైన్స్ షాపులకు ప్రధాన ఆదాయ వనరులైన బెల్టు షాపులు ఎత్తివేశారు. కేవలం షాపుల్లో రిటైల్ వ్యాపారమే సాగింది. కౌంటర్ వ్యాపారమే అధికంగా సాగింది. అక్కడక్కడ అడ్డదారిలో మద్యం విక్రయాలు సాగాయి. డిసెంబర్ 3న ఫలితాలు వెల్లడయ్యాక, 5వ తేదీ వరకు కోడ్ కొనసాగింది. అప్పటిదాకా పెద్దగా పట్టించుకోని అధికారులు, కోడ్ ముగిశాక గత జనవరి నుంచి మామూళ్ల పర్వం యథావిధిగా సాగించారు. ఇప్పటికే చాలా షాపుల లైసెన్సుదారుల నుంచి మామూళ్ల అందుతున్నట్లు తెలుస్తోంది.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే వివేక్



సీఎం రేవంత్‌రెడ్డితో వివేక్, వంశీకృష్ణ

చెన్నూర్: చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి, ఆయన కుమారుడు గడ్డం వంశీకృష్ణ బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పెద్దపల్లి ఎంపీ టికెట్ కోసం వంశీకృష్ణ దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. తండ్రీకొడుకులు సీఎంను కలువడంతో ఎంపీ టిక్కెట్ ఖరారు కోసమేనని అనుచర వర్గం చర్చించుకుంటోంది. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఓటు విలువ తెలుసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకోవాలని, ఎన్నికల్లో కచ్చితంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, మంచిర్యాల ఆర్డీవో రాములు, చెన్నూర్ ప్రత్యేక సబ్ కలెక్టర్ సిడాం దత్తుతో కలిసి తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం 2024 ద్వారా నూతన ఓటరు నమోదు, మార్పులు, సవరణలు, తొలగింపులకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ నెల 8న తుది జాబితా ప్రచురణకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ప్రైవేటు ఆ'పరేషాన్'!



ప్రభుత్వ ఆస్పత్రిలో బాలింతలు(ఫైల్)

- ముహూర్తాల ప్రకారమే ప్రసవాలు..?
- ప్రైవేటు ఆస్పత్రుల్లోనే శస్త్రచికిత్సలు అధికం

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆపరేషన్ ద్వారా ప్రసవాలకే మొగ్గు చూపుతున్నారు. మాతాశిశు ఆరోగ్యం కోసం సాధారణ ప్రసవాలు చేయాలని కొన్నేళ్లుగా చెబుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. అత్యధిక ఆపరేషన్లతో మంచిర్యాల జిల్లా రాష్ట్రంలోనే ముందుండడం గమనార్హం. సాధారణ ప్రసవాల చేయడంలో ఇతర జిల్లాలు పోటీ పడుతుండగా.. జిల్లా మిగతా జిల్లాల కంటే వెనుకబడి ఉంది. దీంతో సిజేరియన్ ద్వారా ప్రసవాలు చేపడుతున్న ఆస్పత్రుల్లో వివరాలు సేకరించాలని హెల్త్ సెక్రెటరీ, కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఈ నెల 2న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖను ఆదేశించింది. జిల్లాలోని 14 ప్రైవేటు ఆస్పత్రులు ఆపరేషన్లకు పోటీ పడుతుండడంతో ఆయా ఆస్పత్రుల్లో జరిగిన శస్త్రచికిత్సల ప్రసవాల వివరాల సేకరణకు మూడు బృందాలు ఏర్పాటు చేశారు. ఈ బృందాలు ఆయా ఆస్పత్రులకు వెళ్లి శస్త్రచికిత్స ద్వారా ప్రసవాలు ఎందుకు చేయాల్సి వచ్చిందో పూర్తి వివరాలు సేకరించి హెల్త్ సెక్రెటరీకి పంపించేందుకు సిద్ధమయ్యారు. గత రెండేళ్లుగా సాధారణ ప్రసవాల కోసం రాష్ట్ర వైద్యారోగ్యశాఖ చర్యలు చేపడుతున్నా జిల్లాలో ఎలాంటి మార్పు తీసుకు రాకపోవడం, ఆపరేషన్లు చేస్తున్నా జిల్లా వైద్యారోగ్యశాఖ చర్యలు తీసుకోవడంతోనే జిల్లా ఆపరేషన్లలో మొదటి స్థానంలో నిలుస్తోందనే ఆరోపణలున్నాయి.

సమీక్షలతోనే సరి.. చర్యలేవి?

ప్రైవేటు ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకు వైద్యులతో ప్రతి నెలా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సమావేశాలు ఏర్పాటు చేస్తోంది. పర్యవేక్షణకు ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్‌ను సైతం నియమించారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేలా చేయడంతో పాటు ప్రైవేటుకు ప్రసవం కోసం వెళ్లిన వారికి అత్యవసరమైతే తప్ప సిజేరియన్ ద్వారా ప్రసవాలు చేయకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్‌ది. కానీ జిల్లాలో పేరుకే ప్రోగ్రాం ఆఫీసర్‌ను నియమించారు. ప్రతి నెలా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో జరిగే సాధారణ, సిజేరియన్ ప్రసవాలను పరిశీలించి, సిజేరియన్‌లు నిర్వహించే ఆస్పత్రుల వైద్యులతో మాట్లాడి సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లోనే సిజేరియన్లు ఏమాత్రం తగ్గడం లేదు. ముహూర్తాలను చూడడం, కుటుంబ సభ్యులు చెప్పిన తేదీ, సమయానికి సిజేరియన్లను చేస్తుండడం వల్లనే ప్రైవేటు ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు పెరగడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై ప్రతీ నెల సమీక్షా సమావేశంలో అధికారులు ప్రైవేటు గైనకాలజిస్టులకు చెబుతున్నా ఏమాత్రం మార్పు రావడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తున్న వారిలో రిస్క్, హైరిస్క్ ఉన్నవారికి మాత్రమే సిజేరియన్ ద్వారా ప్రసవం చేస్తుండగా, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎలాంటి రిస్క్, హైరిస్క్ లేకున్నా సిజేరియన్లతో ప్రసవాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతీ ప్రైవేటు ఆస్పత్రిలో ముహూర్తపు ప్రసవాలు చేయబడవు అనే బోర్డులు ఏర్పాటు చేయాలన్న ఆదేశాలనూ పాటించడం లేదు. సాధారణ ప్రసవాలు జరిగితే వచ్చే ఫీజుల కన్నా సిజేరియన్ల ద్వారా రూ.60 వేలకు పైగా వస్తుండడంతోనే చేస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు ప్రసవాలు

ఆస్పత్రులు	సాధారణం	సిజేరియన్	మొత్తం ప్రసవాలు
ప్రభుత్వ	2,451	2,560	5,011
ప్రైవేటు	477	3,406	3,883



చర్యలు తీసుకుంటాం



జిల్లాలో 14 ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్లు ఎక్కువగా చేస్తున్నట్లు గుర్తించి హెల్త్ కమిషన్ నుంచి వివరాలు సేకరించాలని వచ్చిన ఆదేశాల మేరకు మూడు టీంలను ఏర్పాటు చేసి ఆయా ఆసుపత్రుల్లో ఆడిట్ చేయిస్తున్నాం. సాధారణ ప్రసవానికి అవకాశం ఉన్నా సిజేరియన్ చేసినట్లుగా గుర్తిస్తే ఆయా వివరాలను హెల్త్ కమిషన్‌కు పంపించి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరిగేందుకు చర్యలు తీసుకోవడంతోపాటు సాధారణ ప్రసవాలు చేసేలా చూస్తున్నాం. ప్రైవేటులో సిజేరియన్లు చేసే ఆసుపత్రులపై ఇక మీదట శాఖాపరంగా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ సుబ్బరాయుడు, జిల్లా వైద్యారోగ్య అధికారి

ఆస్పత్రిలోనే ప్రసవాలకు చర్యలు

- జిల్లా కలెక్టర్ బి. సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గర్భం దాల్చిన ప్రతీ మహిళ ప్రసవం ఆసుపత్రిలోనే జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఎంహెచ్ఓ సుబ్బరాయుడుతో కలిసి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యాధికారులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షకులు, మాతాశిశు ఆసుపత్రి వైద్యులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ఫేస్ యాప్ హాజరును కచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. 'సాధారణ ప్రసవాలు ముద్దు– సిజేరియన్లు వద్దు' అనే నినాదంతో మహిళల్లో అవగాహన కల్పించాలని, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్ ప్రసవాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు హరిశ్చంద్రారెడ్డి, ఆర్ఎంవో భీష్మ, మాతాశిశు ఆసుపత్రి ఇన్‌చార్జి డాక్టర్ వేదవ్యాస్ పాల్గొన్నారు.

ప్రజల అవగాహన కోసం ఈవీఎం కేంద్రం

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్ ఆవరణలో ఈవీఎం, వీవీ ప్యాట్ అవగాహన కేంద్రం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ బి.సంతోష్ తెలిపారు. ఓటు వేసే విధానాన్ని వివరించేందుకు ఈ కేంద్రం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు.



కాసిపేట: మందులు పరిశీలిస్తున్న కలెక్టర్

సమన్వయంతో పనిచేయాలి

కాసిపేట: ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో భాగంగా ఈ నెల 7నుంచి 14వరకు ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సంతోష్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని కాసిపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంతోపాటు సాలెగూడ గట్రావుపల్లి, దేవాపూర్ గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి రిజిష్టర్లు, రికార్డులు, వార్డులు, పరిసరాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంఎ అలీం, వైద్యాధికారులు రవికిరణ్, శివప్రతాప్, ఝాన్సీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ వినయ్ పాల్గొన్నారు.

12న నులిపురుగుల నివారణ

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 12న నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు హరికృష్ణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుబ్బరాయుడుతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని విద్యార్థులందరికీ 100 శాతం నివారణ మాత్రలు అందించే లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి మాసాంతం వరకు 1,92,709 మందికి మాత్రలు అందించడం లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు.

కాంగ్రెస్ వైపు కౌన్సిలర్ల చూపు..?

చెన్నూర్: చెన్నూర్ మున్సిపల్ కౌన్సిలర్లు కొందరు కాంగ్రెస్ పార్టీలో చేరికకు సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది. మున్సిపాల్టీలో 18మంది కౌన్సిలర్లు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఒకటో వార్డు కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీలో చేరగా ప్రస్తుతం బీఆర్ఎస్‌కు 17మంది ఉన్నారు. కొందరు కాంగ్రెస్‌లో చేరికకు ఆ పార్టీ నాయకులతో మంతనాలు చేస్తున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఇటీవల మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని సొంత పార్టీ నాయకులు లోలోపల వ్యతిరేకిస్తున్నారు. ఇందులో కౌన్సిలర్లు సైతం ఉన్నట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యేపై ఎఫ్ఐఆర్ నమోదు నేపథ్యంలో చెన్నూర్‌లో బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు సమావేశం కాగా కొందరు కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. క్యాతనపల్లిలో జరిగిన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికీ హాజరు కాలేదు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఎన్నికల తర్వాత ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీలో కొత్త వారిని ఎవరినీ చేర్చుకునేది లేదంటూ కుండబద్దలు కొట్టినట్లుగా మాట్లాడారు. దీంతో కాంగ్రెస్‌లో చేరికకు సిద్ధమైన కొందరు కౌన్సిలర్లు వెనుకడుగు వేశారు. ఇటీవల క్యాతన్‌పల్లి మున్సిపల్ కౌన్సిలర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతోపాటు అవిశ్వాసానికి సిద్ధమయ్యారు. దీంతో చెన్నూర్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరికకు కొందరు నేతలతో రహస్య మంతనాలు సాగిస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

ఎంపీ ఎన్నికల్లో గెలుపునకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్, వేదికపై రఘునాథ్, నాయకులు

మంచిర్యాలటౌన్: పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అధ్యక్షతన పెద్దపల్లి పార్లమెంటు స్థాయి బీజేపీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పదేళ్ల పాలన విజయాలు, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రతీ కార్యకర్త సైనికుల్లా శ్రమించి పార్టీ విజయం దిశగా పనిచేయాలని కోరారు. మరోసారి దేశంలో మోదీ ప్రభుత్వం ఏర్పడుతుందనే ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొప్పు భాషా, గోనె శ్యాంసుందర్ రావు, పెద్దపల్లి పార్లమెంటు కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, కందుల సంధ్యారాణి, దుర్గం అశోక్, ముల్కల్ల మల్లారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్ పోటీలు



కాసిపేట: ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: జాతీయ సైన్స్ దినోత్సవ సంబరాల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు మండల స్థాయి పోటీలు నిర్వహించారు. జిల్లా సైన్స్ కేంద్రంలో మంచిర్యాల మండల విద్యార్థులకు సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్, చెత్తను తొలగించడం, ఈ–వ్యర్థాలను తగ్గించడం, ఆరోగ్యకరమైన అలవాట్లను దత్తత తీసుకోవడం తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. కేజీబీవీ మంచిర్యాలకు చెందిన అక్షిత(పెయింటింగ్), ప్రభుత్వ ఉన్నత పాఠశాల గర్మిళ్లకు చెందిన అఖిల(కవిత్వం), జెడ్పీఎస్ఎస్(గరల్స్), మంచిర్యాల విద్యార్థి సాయి భార్గవి(పాటలు పాడడం), జెడ్పీఎస్ఎస్(బాలుర)కు చెందిన వరుణ్‌తేజ్ ఉపన్యాస పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పోటీలను ఎంఈవో పోచయ్య, నోడల్ ఆఫీసర్ మాళవిదేవి పర్యవేక్షించారు.

కాసిపేటలో..

కాసిపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మండల స్థాయి పోటీలు నిర్వహించారు. మండల నోడల్ అధికారి రమేష్ రాథోడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈ నెల 10న జిల్లా కేంద్రంలో నిర్వహించే పోటీలకు ఎంపిక చేశారు. పాటల విభాగంలో మల్కేపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన ఆత్రం అరుణ్, ఉపన్యాసంలో బిందుప్రియ(జెడ్పీహెచ్ఎస్ ముత్యంపల్లి), పెయింటింగ్‌లో సీహెచ్.తానియా(జెడ్పీహెచ్ఎస్ దేవాపూర్), కవితల్లో బి.మహేష్(జెడ్పీహెచ్ఎస్ ముత్యంపల్లి) ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంలు సాంబమూర్తి, సుధాకర్‌నాయక్, సమన్వయకర్త రమణారెడ్డి, ఉపాధ్యాయులు శాంకరీ, వేములవాడ రమేష్, కల్లెం మోహన్ పాల్గొన్నారు.

రోజుకు 150 వాహనాలకే అనుమతి

చెన్నూర్: చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని చెన్నూర్, భీమారం, జైపూర్, కోటపల్లి మండలాలకు చెందిన రైతులు రోజుకు 150 వాహనాలనే తీసుకు రావాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు బంద్ చేస్తారనే వదంతులను రైతులు నమ్మవద్దని తెలిపారు. పత్తి వాహనాలు ఎక్కువగా రావడంతో మిల్లుల్లో ఇబ్బంది ఏర్పడుతోందని, రోజుకు 150 వాహనాలను మాత్రమే అనుమతిస్తామని పేర్కొన్నారు. శని, ఆదివారాల్లో తప్ప మిగతా రోజుల్లో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేస్తామని తెలిపారు. రైతులు వ్యవసాయ మార్కెట్ అధికారులకు సహకరించాలని కోరారు.

వాణి వినిపించాలి.. నిధులు తేవాలి

ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత తొలిసారి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు మొదటిసారి శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. గత ప్రభుత్వ హయాంలో మరుగున పడిన అనేక అభివృద్ధి పనులు, సాగునీటి ప్రాజెక్టులకు మోక్షం లభిస్తుందని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యేలు తమ వాణి వినిపించి ఉమ్మడి జిల్లాకు నిధుల తెచ్చేందుకు కృషి చేయాలని కోరుతున్నారు.

‘ప్రాణహిత’ను ప్రస్తావిస్తా



ఆసిఫాబాద్/కౌటాల: ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో ప్రాజెక్టు నిర్మాణం అంశాన్ని సభలో ప్రస్తావిస్తా. గతంలో పోడు భూముల విషయంలో నమోదైన కేసులు ఎత్తివేయాలని కోరుతా. కాగజ్‌నగర్‌లోని ఎస్పీఎం(పేపర్ మిల్లు)లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి. సిర్పూర్ నియోజకవర్గ సమస్యలను లేవనెత్తుతా.

– డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు, సిర్పూర్ ఎమ్మెల్యే

గోదావరి జలాలు, మరుగుదొడ్ల సమస్యలు



బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో తాగు నీటి కష్టాలు ఉన్నాయి. ప్రస్తుతం సరఫరా అవుతున్న అడ ప్రాజెక్టు నీటిని తాగేందుకు ప్రజలు ఇష్టపడటం లేదు. గోదావరి జలాలు సరఫరా చేయాలని కోరుతున్నారు. ఇదే అంశాన్ని అసెంబ్లీలో ప్రభుత్వం ముందుంచుతా. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలల సమస్యను పరిష్కరించేందుకు నిధులు కేటాయించాలని కోరుతా. ఈ రెండు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తా.

– గడ్డం వినోద్, బెల్లంపల్లి ఎమ్మెల్యే

నాగోబా స్మరణలో ‘మెస్రం’

- మర్రిచెట్టు వద్ద కొనసాగుతున్న పూజలు
- దేవుడు, వంశ చరిత్రను బోధిస్తున్న పెద్దలు
- కితల వారీగా సామూహిక వంటలు



తూమ్ పూజలకు నైవేద్యం తయారు చేసేందుకు బియ్యం సేకరిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: నాగోబా స్మరణలో మర్రిచెట్టు వద్ద బస చేసిన మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని ఈ నెల 9న నిర్వహించే నాగోబా మహాపూజకు అవసరమయ్యే గంగాజలంతో వచ్చిన మెస్రం వంశీయులు కేస్లాపూర్ గ్రామ పొలిమేరలో పడియోర్ జన్మస్థలమైన మర్రిచెట్టు వద్ద బస చేశారు. ఉమ్మడి జిల్లా, మహారాష్ట్ర నుంచి మెస్రం వంశీయులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. రాత్రి ప్రదాన్ కితకు చెందిన మెస్రం పెద్దల ఆధ్వర్యంలో కిక్రి వాయిస్తూ నాగోబా చరిత్ర, 22 కితల మెస్రం వంశీయుల చరిత్రను బోధిస్తున్నారు. బుధవారం 22 కితల వారీగా జొన్నగట్కతో సంప్రదాయ వంటలు చేసి నైవేద్యం సమర్పించారు. జొన్నగట్కను ఉండలు చేసి కితలవారీగా పంపిణీ చేశారు. రాత్రి మెస్రం వంశంలోని 22 కితాల్లో మరణించిన పెద్దల పేరుతో తూమ్ (కర్మకాండ) పూజలు చేశారు. 9న జాతర ప్రారంభించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు.

తూమ్ పూజలు (కర్మకాండ)

మర్రిచెట్టు వద్ద బస చేసిన మెస్రం వంశీయులు బుధవారం రాత్రి తూమ్ పూజ (కర్మఖాండ) ఘనంగా నిర్వహించారు. 22 కితల మెస్రం వంశీయుల్లో మరణించిన పెద్దల పేర్లతో తూమ్ (కర్మకాండ)పూజలు చేశారు. తూమ్ పూజలతో వారు నాగోబా సన్నిధికి చేరినట్లు భావిస్తారు.



కష్టసుఖాలు పంచుకుంటున్న మెస్రం మహిళలు



వంటలు చేస్తున్న మెస్రం వంశ మహిళలు



ఎడ్లబండిపై వస్తున్న మెస్రం వంశీయులు

జొన్నగట్క ప్రత్యేకత



జొన్నగట్కతో తయారు చేస్తున్న ఉండలు

మెస్రం వంశీయుల సంప్రదాయ వంట జొన్నగట్కకు ప్రత్యేకత ఉంది. బియ్యం పాముకరంగులో ఉండడం, పప్పు ధాన్యాలు పాము కళ్ల ఆకారంలో పోల్చి నాగోబా పూజల ప్రారంభం నుంచి ముగింపు వరకు ఇండ్ల నుండి తీసుకొచ్చిన జొన్నగట్క, పిండి పదార్థాలతో తయారుచేసిన చారు (కూర)ను కితల వారీగా వండి భోజనాలు చేస్తారు.

నాగోబా ఆలయానికి చేరిన కుండలు



ఆలయ ఆవరణలో కుండలు

నాగోబా మహాపూజ, సంప్రదాయ పూజలకు అవసరమయ్యే సిరికొండ మండల కేంద్రంలోని గుగ్గిల స్వామి తయారు చేసిన ఏడు రకాల 350 మట్టి కుండలు, మట్టి పాత్రలు బుధవారం నాగోబా ఆలయానికి చేరాయి. 20 పెద్ద బాణాలు, 55 కుండలు, 55 మూతలు, 45 కడుముంతలు, 150 దీపాంతలను నాగోబా ఆలయంలో భద్రపరిచారు.

పనితీరు మెరుగుపర్చుకోవాలి

రెబ్బెన: సింగరేణి సంస్థ పురోభివృద్ధి కోసం ఉద్యోగులంతా తమ పనితీరును మరింత మెరుగుపర్చుకోవాలని ఎస్వోటూ జీఎం మచ్చగిరి నరేందర్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి ఏరియా లోని గోలేటి సీహెచ్‌పీలో మల్టీ డిపార్టుమెంటల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షిఫ్టుల వారీగా ఉద్యోగులకు సంస్థ సాధించిన ప్రగతితో పాటు భవిష్యత్ కార్యాచరణను వివరించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం ఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహారా, డీజీఎం ఎఫ్అండ్ఏ రామారావు, పర్సనల్ మేనేజర్ తిరుపతి పాల్గొన్నారు.

ఇసుక డంప్‌లు సీజ్

భీమారం: మండలంలోని ఎలకేశ్వరం రహదారి పక్కన చేనులో నిల్వ ఉంచిన ఇసుక కుప్పలను బుధవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా 15 ట్రాక్టర్ల ఇసుక నిల్వ ఉంచారని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ స్రవంతి తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్ విజయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాలపై అవగాహన

జన్నారం: ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలపై 10వ ఎన్డీఆర్ఎఫ్ బృందం బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అవగాహన కల్పించారు. అనుకోకుండా, ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడే ప్రమాదాల నుంచి తప్పించుకునే విధానంపై అవగాహన ఉంటే ప్రాణాలు కాపాడుకోవచ్చని 10వ ఎన్డీఆర్ఎఫ్ బెటాలియన్ సీఐ బిటిన్ తెలిపారు. గుండెపోటు వస్తే సీపీఆర్ చేసే విధానం, అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి అనే అంశాలపై ప్రత్యక్షంగా తెలియజేశారు. ఎంపీడీవో అరుణరాణి, ఆర్ఐ భానుచందర్ పాల్గొన్నారు.

బకాయిల చెల్లింపునకు హామీ

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



సమావేశంలో పాల్గొన్న సత్తయ్య

శ్రీరాంపూర్: 11వ వేతన ఒప్పంద పరిధిలో రిటైర్డ్ కార్మికులకు సంబంధించిన బకాయిలు వెంటనే చెల్లించడానికి కోలిండియా యాజమాన్యం హామీ ఇచ్చిందని బీఎంఎస్ అధ్యక్షుడు, స్టాండర్డైజేషన్ సభ్యులు యాదిగిరి సత్తయ్య తెలిపారు. బుధవారం రాజస్థాన్‌లోని జైసాల్మర్‌లో జరిగిన జేబీసీసీఐ-11, 2వ స్టాండర్డైజేషన్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అందులో అన్ని క్యాడర్‌స్కీంలపై చర్చించామని, రాబోయే సమావేశాల్లో వీటీపీఐ నిర్ణయం తీసుకోవడానికి యాజమాన్యం అంగీకరించిందన్నారు. బొగ్గు పరిశ్రమల్లో పని చేసే కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు, వార్షిక బోనస్, పీఎల్ఆర్ చెల్లింపులకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవడానికి అంగీకారం కుదిరిందన్నారు. బొగ్గు పరిశ్రమల్లో బదిలీ వర్కర్ డిజిగ్నేషన్‌ను రద్దు చేసి దాని స్థానంలో గౌరవ ప్రదమైన డిజిగ్నేషన్ ఇవ్వాలని డిమాండ్ చేయగా తదుపరి సమావేశాల్లో నిర్ణయం తీసుకుంటామన్నారన్నారు. ఇంకా పలు అంశాలపై చర్చించడం జరిగిందన్నారు.

కొత్త గనుల ఏర్పాటుకు కృషి చేయాలి



మల్లు రవికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణిలో కొత్త గనుల ఏర్పాటుకు అవసరమైన కేంద్ర ప్రభుత్వ అనుమతులు త్వరగా వచ్చేలా కృషి చేయాలని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కాంగ్రెస్ అధికార ప్రతినిధి మల్లు రవిని కోరారు. బుధవారం ఢిల్లీకి వెళ్లి ఆయన నివాసంలో కలిసి సింగరేణి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కొత్తగూడెం వీకే 7 ఓసీపీ, ఇల్లందులో రొంపేడు ఓసీపీలకు ఫారెస్ట్ క్లియరెన్స్ త్వరగా వచ్చేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఎంపీ రావు, కోశాధికారి జిమ్మిడి మల్లేశ్, నాయకులు కాసిపేట కృష్ణ, డేగల ప్రవీణ్ కుమార్ శని గారపు కుమారస్వామి, బూర్గుల రామారావు, నక్క సుమన్, శ్రీనాథ్ పాక రవి పాల్గొన్నారు.

దొంగను బెదిరించి దోచుకున్న ఆటోడ్రైవర్


- పోలీసుల అదుపులో నిందితులు

మంచిర్యాలక్రైం: దోచుకున్న సొమ్ము, నగదుతో ఆటోలో పారిపోతున్న ఓ దొంగను కొందరు ఆటోడ్రైవర్లు బెదిరించి దోచుకున్న ఘటన జిల్లా కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని రాజురకు చెందిన కాకట్ల కేశవరెడ్డి ఈ నెల 6న శ్రీరాంపూర్ వాటర్ ట్యాంక్ ఏరియాకు చెందిన మంద భాస్కర్ ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. దోచుకున్న రూ.లక్షకు పైగా నగదుతో బుధవారం శ్రీరాంపూర్ నుంచి ఆటోలో మంచిర్యాలకు వెళ్తుండగా అదే ఆటో డ్రైవర్‌తో పాటు మరికొందరు కేశవరెడ్డిని బెదిరించి అతని బ్యాగును తనిఖీ చేయగా అందులో రూ.51 వేల నగదు లభించింది. ఇంత డబ్బు ఎక్కడిదని అందులోంచి రూ.31వెయ్యి నగదు శేఖర్ తీసుకున్నాడు. ఈ క్రమంలో కేశవరెడ్డి, శేఖర్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మిగతా వ్యక్తులు 100కు డయల్ చేసి సమాచారం అందించారు. పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన ఎస్సై విచారణ జరుపుతున్నారు.

ఉత్పత్తి, ఉత్పాదకత పెంచాలి

శ్రీరాంపూర్: ప్రస్తుత పరిస్థితిలో సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకత మరింత పెరగాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ బీ సంజీవరెడ్డి అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిపై నిర్వహించిన మల్టీ డిపార్టుమెంటల్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి సంస్థ ఆర్థికంగా పరిపుష్టి సాధించాలంటే కొత్త ప్రణాళికలను సిద్ధం చేసుకుని దానికి అనుగుణంగా ముందుకెళ్లాలన్నారు. సంస్థ ముందు అనేక సవాళ్లు ఉన్నాయని దీనికోసం ఉత్పత్తిని, ఉత్పాదకతను బొగ్గు నాణ్యత ప్రమాణాలను పెంపొందించుకోవడం ముఖ్యమన్నారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం రఘుకుమార్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజీఎం మురళీధర్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి పురుషోత్తంరెడ్డి, మేనేజర్ సుధీర్ జక్కుల వార్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలి



మాట్లాడుతున్న జీఎం మనోహర్

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 2గనిపై బుధవారం మల్టీ డిపార్టుమెంటల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఏరియా జీఎం మనోహర్ మాట్లాడుతూ కంపెనీ ఉత్పత్తి, ఉత్పాదకత, లక్ష్యాలు, సాధించిన విజయాలు, ఓసీలు, భూగర్భ గనుల్లో యంత్రాల వినియోగం గురించి కార్మికులకు వివరించారు. ప్రతీ ఉద్యోగి తమకు కేటాయించిన పనులు నిబద్ధతతో చేసినట్లయితే సంస్థ అన్నిరంగాల్లో ముందుంటుందన్నారు. అనంతరం కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, కేకే గ్రూప్ ఏజెంట్ రాందాస్, సీఎంవోఏఐ అధ్యక్షుడు షైడీశ్వర్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, ఐఈడీ రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ గాడిన పడేనా..?

- దృష్టి సారిస్తున్న ప్రజాప్రతినిధులు
- విద్యార్థుల్లో పెరుగుతున్న ధైర్యం



బాసర ట్రిపుల్‌ఐటీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్ (ఫైల్)

భైంసా(ముధోల్): బాసర ట్రిపుల్‌ఐటీలో నెలకొన్న సమస్యలపై ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తున్నారు. సోమవారం ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ట్రిపుల్‌ఐటీకి వెళ్లి పరిశీలించారు. విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు అధైర్యపడవద్దని.. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఉండే వసతిగృహాలు, మరుగుదొడ్లు, స్నానపు గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

పెరుగుతున్న ధైర్యం...

ట్రిపుల్‌ఐటీలో కొన్నేళ్లుగా పాతుకుపోయిన కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మెస్‌లలో పురుగుల అన్నం పెట్టే పరిస్థితిని మార్చాలని విద్యార్థులు ఎమ్మెల్యేను కోరారు. బాసర ట్రిపుల్‌ఐటీ అధికారులు పెడుతున్న ఆంక్షలు గోప్యత కారణంగా ఏం జరుగుతుందో తెలియక విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ట్రిపుల్‌ఐటీలో జరుగుతున్న అక్రమాలపై అవసరమైతే విజిలెన్స్‌తో విచారణ చేయిస్తానని ఎమ్మెల్యే రామారావుపటేల్ హామీ ఇచ్చారు. విద్య, వైద్యంపై తాను రాజీపడనన్నారు. ఎమ్మెల్యే పర్యటనతో ట్రిపుల్‌ఐటీ మెస్‌ల నిర్వాహణపైన క్యాంపస్ అధికారులు దృష్టి సారించారు.

16 ఏళ్లుగా నిరీక్షణ...

ఉమ్మడి రాష్ట్రంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి 2008లో బాసర, ఇడుపులపాయ, నూజివీడులలో ట్రిపుల్‌ఐటీలను ప్రారంభించారు. రాష్ట్ర విభజన అనంతరం మన రాష్ట్రానికి బాసర ట్రిపుల్‌ఐటీ ఒక్కటే మిగిలింది. ట్రిపుల్‌ఐటీ ప్రారంభంలో 129 మంది కాంట్రాక్టు అధ్యాపకులు, 19 మంది పర్మినెంట్ ప్రొఫెసర్లను ప్రభుత్వం నియమించింది. 16 ఏళ్లుగా వారే పనిచేస్తున్నారు. మరో 70 మంది అధ్యాపకులను గెస్ట్ ఫ్యాకల్టీగా తాత్కాలికంగా నియమించుకున్నారు. మరో 125 మంది ప్రొఫెసర్లు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం 2014లో సూచించింది. ఇప్పటికీ ఈ పోస్టుల భర్తీ జరుగలేదు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించింది. కానీ యూనివర్సిటీ ఏర్పడినప్పటి నుంచి పనిచేస్తున్న ట్రిపుల్‌ఐటీ కాంట్రాక్టు ఉద్యోగులు క్రమబద్ధీకరణకు నోచుకోవడంలేదు. ఉద్యోగ భద్రత లేకపోవడంతో ప్రత్యామ్నాయ అవకాశాలు వస్తే ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లి పోతున్నారు. 19 మంది పర్మినెంట్ ప్రొఫెసర్లు ఉంటే ఉన్నత చదువుల పేరిట 12 మంది సెలవులో వెళ్లారు. తాత్కాలిక అధ్యాపకులను నియమించుకుని విద్యాసంవత్సరం వెళ్లదీస్తున్నారు. ఒకవైపు విద్యాబోధన మరోవైపు అదనపు బాధ్యతలతో తీవ్ర పనిఒత్తిడికి గురవుతున్నారు. ఎక్కడ లోపం జరిగినా క్రమశిక్షణ చర్యలకు బాధ్యులవుతామనే భయం ఉద్యోగులను వెంటాడుతోంది. డీన్‌లు, హెడ్ ఆఫ్‌ద డిపార్ట్‌మెంట్, ఎగ్జామినర్, చీఫ్ వార్డెన్, వార్డెన్, స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ వంటి కీలకమైన బాధ్యతలను అధ్యాపకులకు అప్పజెప్పున్నారు. ట్రిపుల్‌ఐటీలో టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. క్రమబద్ధీకరణతోపాటు నిబంధనల ప్రకారం వేతనాల పెంపు, ఇతర భత్యాల కోసం ఈ ఉద్యోగులంతా మూడు నెలలకోసారి పోరాటం చేస్తున్నారు.

వసతులు అంతంతే...

ట్రిపుల్‌ఐటీలో వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మరుగుదొడ్ల నిర్వాహణ సరిగాలేదు.నిబంధనల పేరిట అధికారులు ఎవరినీ అనుమతించడంలేదు. క్యాంపస్‌లో ఏంజరిగినా బయటకు పొక్కనివ్వడంలేదు. మెస్‌లలో పురుగుల అన్నం వచ్చినా విద్యార్థులు అలాగే భోజనాలు చేస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బందికి తోడు కొంత మంది రిటైర్డ్ ఆర్మీ అధికారులను నియమించుకుని పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. విద్యార్థులు తరగతి గదిలో లేదంటే భోజన శాలకు అక్కడి నుంచి నేరుగా హాస్టల్ గదుల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు. నలుగురు కలిసి మాట్లాడినా విచారణ ఎదుర్కొవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థుల ఫోన్‌లు తీసుకుని తనిఖీలు కూడా చేస్తున్నారు. చిన్న చిన్న తప్పిదాలకు సంజాయిషి లెటర్‌లు రాయించుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితులు విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రెండు, మూడేళ్లుగా ట్రిపుల్‌ఐటీ సమస్యలపై ఆందోళనలు చేసిన విద్యార్థులపై సైతం నిఘా ఉంచినట్లు సమాచారం.

సమస్యలు నా దృష్టికి తీసుకురండి

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ఏ సమస్య ఉన్నా నన్ను సంప్రదించవచ్చు. విద్యార్థుల ఇబ్బందులు ధైర్యంగా తెలియజేయవచ్చు. విద్య, వైద్యం విషయంలో రాజీపడలేం. ట్రిపుల్‌ఐటీలో అక్రమాలపై అవసరమైతే విజిలెన్స్ విచారణ చేయిస్తాం. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే మా లక్ష్యం.

– రామారావుపటేల్, ఎమ్మెల్యే, ముధోల్

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

బెల్లంపల్లి: రైలు కిందపడి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ కె.సురేష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.... బెల్లంపల్లి మున్సిపాలిటీ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన కదాసి సత్యనారాయణ (51) రైస్ మిల్లు ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. కుటుంబంలో కలహాలు చోటు చేసుకోవడంతో మనస్తాపం చెంది బుధవారం కన్నాల రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కిందకు వెళ్లి ఓ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహానికి పంచనామా నిర్వహించి అతని భార్య మల్లేశ్వరికి అప్పగించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

జాతరకు వెళ్లి శవమై వచ్చాడు

- నీటిలో మునిగి యువకుడు మృతి



స్వాగత్ (ఫైల్)

మందమర్రిరూరల్: కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా మేడారం జాతరకు వెళ్లిన స్వాగత్ శవమై ఇంటికి రావడంతో పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మందమర్రి పట్టణంలోని దీపక్‌నగర్‌కు చెందిన లక్ష్మణ్, వాణి దంపతుల కుమారుడు స్వాగత్(25) సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి మేడారం వెళ్లాడు. మొక్కులు తీర్చుకున్న అనంతరం మంగళవారం జంపన్నవాగు సమీపంలో బస చేశారు. బంధువుల పిల్లలతో కలిసి స్వాగత్ అక్కడే ఉన్న నీటిలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. నీటిలోకి దిగి బయటకు రాకపోవడంతో అధికారులకు ఫిర్యాదు చేశారు. రెస్క్యూ టీం వెతుకగా బుధవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. మృతదేహానికి ములుగు ప్రభుత్వాసుపత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పందెంరాయుళ్ల అరెస్ట్



పందెం రాయుళ్లతో టాస్క్‌ఫోర్స్ అధికారులు

బెజ్జూర్: మండలంలోని సలుగుపల్లి శివారులో కోడిపందేలు ఆడతున్న వారిని టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్ట్ చేశారు. ఎస్పీ కే సురేష్ కుమార్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, ఎస్సై సందీప్ కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి పదిహేను మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.41,740 నగదుతో పాటు నాలుగు పందెం కోళ్లు, 11 ఫోన్లు, పది కత్తులు, 5 బైకులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను బెజ్జూర్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. దాడుల్లో పీసీలు మధు, రమేశ్, సంజీవ్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.